# మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న పోచంపల్లి పై స్థానిక ఎమ్మెల్యే విమర్శలు దురదృష్టకరం

## బిఆర్ఎస్ నాయకులు కొక్కిరాల రాకేష్ రావు.

పరకాల, జూన్ 19: (వుదయం ప్రతినిధి)వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకుడు కొక్కిరాల రాకేష్ రావు విమర్శించారు. మహిళల సాధికారత,



ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాకేష్ రావు మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడే తీరు ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. 40 ఏళ్ల సీనియారిటీ కేవలం మాటలకే పరిమితమా, ప్రజా సమస్యలు మరియు సామాజిక కార్యక్రమాల పట్ల బాధ్యతలో కనిపించదా అని ప్రశ్నించారు.మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కాళ్లపై తాము నిలబడేలా చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాకేష్ రావు తెలిపారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ అందించడంతో పాటు, శిక్షణ పూర్తిచేసిన వారికి కుట్టు మిషన్లను కూడా పంపిణీ చేస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని వివరించారు.ప్రభుత్వంలో, అధికారంలో ఉన్నప్పటికీ మహిళల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేని వారు, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న వ్యక్తులపై విమర్శలు చేయడం తగదన్నారు. ప్రజల్లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి పెరుగుతున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజా సేవా కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడకుండా, మహిళల అభ్యున్నతికి మరింతగా ఎలా తోడ్పడాలనే దానిపై దృష్టి సారించాలని రేవూరి ప్రకాష్ రెడ్డికి రాకేష్ రావు సూచించారు. సమాజంలో మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడే కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# ఆర్థిక సాధికారతకు శిక్షణలే బలమైన పునాది

## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




హసన్ పర్తి జూన్19 (వుదయం ప్రతినిధి): ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు) తమతో పాటు సమాజ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ) లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 64 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని (ఫైనాన్షియల్ లిటరసీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్) జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహణ, లక్ష్యాలు, అందిస్తున్న అంశాలపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యుల్లో డిజిటల్ లావాదేవీలు, నగదు రహిత చెల్లింపులు, సైబర్ నేరాల నివారణ, బ్యాంకింగ్ సేవల వినియోగం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలపై సీఆర్పీలకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మరియు ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఇన్‌చార్జి డైరెక్టర్ మహేందర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సభ్యులకు సమర్థవంతంగా చేరవేసి ఆర్థిక అక్షరాస్యతను మరింత విస్తరించాల్సిన బాధ్యత సీఆర్పీల పై ఉందన్నారు. ఆర్థిక వ్యవహారాల పై అవగాహన పెరగడం ద్వారా కుటుంబాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం సంస్థలో కుట్టు మరియు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 40 మంది మహిళలతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. శిక్షణ ద్వారా పొందుతున్న నైపుణ్యాలను స్వయం ఉపాధి అవకాశాలుగా మలుచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం సంస్కృతి విహార్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, తహసీల్దార్ కిరణ్ కుమార్, డీఈ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

## వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు.. మృతుల కుటుంబాలకు సానుభూతి

పెద్దపల్లి, జూన్ 19 (వుదయం కరస్పాండెంట్ ):మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధుకర్ గురువారం పలు గ్రామాల్లో పర్యటించి మృతుల కుటుంబాలను పరామర్శించారు.

రామగిరి మండలం సుందిల్ల గ్రామంలో గర్రెపల్లి సత్యనారాయణ గౌడ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న పుట్ట మధుకర్, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అలాగే మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన కొమ్ము రాజమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి మనోధైర్యం చెబుతూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటానని పుట్ట మధుకర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## – కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన విప్ ఆది శ్రీనివాస్.



వేములవాడ, జూన్ 19 (వుదయం ప్రతినిధి ): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూము మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కార్యకర్తలు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లోనూ, ప్రజాక్షేత్రంలోనూ నిరంతరం ప్రస్తావిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన చేస్తున్న పోరాటం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశంలో పెరుగుతున్న అసమానతలను నిర్మూలించాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర, మణిపూర్ నుంచి ముంబై వరకు నిర్వహించిన పాదయాత్రల ద్వారా ప్రజల జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా అధ్యయనం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ రాజీలేని పోరాటం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీని ఆదర్శంగా తీసుకొని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసి, రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడాలనే సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, దేశానికి మరిన్ని సేవలు అందించాలని కోరారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలపల్లె ప్రాథమిక పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేత




ముత్తారం, జూన్ 19:ముత్తారం మండలంలోని జిల్లాలపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం, ఉప సర్పంచ్ శ్రీవాణి ప్రవీణ్ తమ సొంత ఖర్చులతో సౌండ్ బాక్స్ స్పీకర్‌ను బహుమతిగా అందజేశారు.

పాఠశాలలో సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడేటప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను గమనించిన ప్రజాప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సౌండ్ సిస్టమ్ ఏర్పాటు వల్ల పాఠశాలలో నిర్వహించే అన్ని కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని వారు తెలిపారు.శుక్రవారం పాఠశాల ఆవరణలో గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో స్పీకర్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పాఠశాలకు ఉపయోగపడే విధంగా సౌండ్ బాక్స్ స్పీకర్‌ను అందించిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని బందెల కౌశికకు ఘన సన్మానం



మంథని మండలం, జూన్ 19:(వుదయం ప్రతినిధి )

మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన బందెల పర్శు లక్ష్మణ్ దంపతుల కుమార్తె బందెల కౌశిక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ప్రతిభ కనబర్చి దేశవ్యాప్తంగా 450వ ర్యాంకు సాధించిన సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బందెల లక్ష్మణ్, ప్రస్తుత సర్పంచ్ స్వరూప రవికుమార్, ఉపసర్పంచ్ బందెల కిట్టు, వార్డు సభ్యులు కలిసి విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బందెల కౌశిక సాధించిన విజయం గ్రామానికి గర్వకారణమని, మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ పిల్లలు విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొని కౌశికకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం

గూడూర్ జూన్ 19 (వుదయం ప్రతినిధి):- గూడూరు మండలంలోని బొద్దుగొండ రైతు వేదికలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కార్యక్రమం వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ నిర్వహించారు. ఎల్ నీ నో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదు అయ్యే పరిస్థితులు ఉన్నందున ఆరుతడి పంటలైన జొన్న సజ్జ రాగి పెసలు మినుములు కంది వేరుశనగ వేసుకోవాలని వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలు తగ్గించాలని తెలిపినారు. తక్కువ కాలంలో పండే పంటలు ఎంచుకోవాలని డ్రిప్ లేదా స్ప్రింకర్ సాగు చేసుకోవాలని వర్షపు నీరు నిలువ చేసుకునే ఏర్పాటు చేసుకోవాలని విత్తనాలను ఆలస్యపు వర్షాలకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలని సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ ఉపసర్పంచ్ ఏ ఈ ఓ మనోజ్ రైతులు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబానికి పరామర్శ



వేములవాడ, జూన్ 19 టవుదయం ప్రతినిధిఉ : వేములవాడ పట్టణంలోని శాత్రజుపల్లికి చెందిన అక్కెనపల్లి మైసవ్వ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు,మైసవ్వ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు.ఆయనతోపాటు పరామర్శించిన వారిలో గుడిసె పురుషోత్తం, గుడిసె కొమురయ్య, కొట్టాల జనార్దన్ రెడ్డి, సుద్దాల బాలయ్య గౌడ్, గుడిసె దాసు, గుడిసె అనిల్, చందనం వెంకటేశం, మనోజ్ తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

# ఈనెల 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జూలై 13న నిర్వహించే నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.**

**మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత.**



ఖానాపురం, జూన్ 19 (వుదయం ప్రతినిధి):ఈనెల 28న మండల వ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు అధికారులు అనధికారులు వైద్య సిబ్బంది అంగన్వాడి సిబ్బంది అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ జ్యోతి అధ్యక్షతన వైద్య సిబ్బందికి అంగన్వాడీ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి పాల్గొని మాట్లాడుతూ జులై 13 నిర్వహించే నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నట్టల నివారణ మాతరలను వేయించాలని మండల వ్యాప్తంగా ఉన్న కాలేజీ హై స్కూల్ పాఠశాల అంగన్వాడి కేంద్రాల పిల్లలందరికీ వేయించాలని ఉపాధ్యాయ బృందానికి అంగన్వాడీ టీచర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 28 నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలొ భాగంగా పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలుపుతూ, మండల వ్యాప్తంగా 25 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలుపుతూ, జూలై 13 న నేషనల్ డి వార్మింగ్ డే సందర్భంగా మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలతో పాటు సైనిక్ స్కూల్ కళాశాల మోడల్ స్కూల్ కళాశాల జ్యోతిబా పూలే, కస్తూరిబా గాంధీ గురుకులలోని సంవత్సరం నుండి 19 సంవత్సరాలు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని వైద్య అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సయ్యద్ జమీరుద్దీన్, హెల్త్ సూపర్వైజర్స్ దామోదర్ రెడ్డి, దేవిక, ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాసచారి,ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, వైద్య సిబ్బంది కనకలక్ష్మి, పరోశిని, విజయరాణి, విజయ, సునీత, సుజాత, రజిత, జ్యోతి, ప్రతిభ, భార్గవి, రమ్య , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ‘ఏఐ, డిజిటల్ లెర్నింగ్’ ఇంటర్న్‌షిప్ శిక్షణ

హనుమకొండ టౌన్, జూన్ 19 (వుదయం ప్రతినిధి) :

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఐదవ సెమిస్టర్ విద్యార్థినుల కోసం నిర్వహించిన రెండు రోజుల ‘కృత్రిమ మేధస్సు (ఇూ×), డిజిటల్ లెర్నింగ్’ ఇంటర్న్‌షిప్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు వేడుకలో విద్యార్థినులకు ప్రాక్టికల్ (హ్యాండ్స్ ఆన్) ట్రైనింగ్ ఇచ్చారు.




తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు “అన్న-అక్క మెంటార్‌షిప్” ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థినుల్లో ఆధునిక సాంకేతికత, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశం.

?ఉపాధి అవకాశాలు, ప్రస్తుత కాలంలో ఏఐ కీలక సాధనంగా మారిందని, విద్యార్థినులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా కొత్త అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ చంద్రమౌళి సూచించారు.

?ప్రాయోగిక శిక్షణ, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు, రిసోర్స్ పర్సన్ అశ్విని విద్యార్థినులకు ఏఐ టూల్స్, డిజిటల్ కంటెంట్ తయారీ, ప్రెజెంటేషన్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. భవిష్యత్ అవసరాల కోసం ఏఐపై పట్టు సాధించడం అవసరమని ఆమె పేర్కొన్నారు.

?పాఠశాలల్లో మెంటార్‌షిప్, ఈ శిక్షణ పొందిన ఐదవ సెమిస్టర్ విద్యార్థినులు జూలై 1వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, అక్కడ చదివే పిల్లలకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్నారు.

?ఈ ఇంటర్న్‌షిప్ విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా. సురేష్ బాబు తెలిపారు. నోడల్ అధికారులు డా. బి. మాధవి, డా. స్వర్ణలత, డా. పి. రాజిరెడ్డిల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. చివరగా రిసోర్స్ పర్సన్ అశ్వినిని కళాశాల యాజమాన్యం శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు ఆత్మీయ ఆహ్వానం..

**తల్లిగారి ఇంటిలా రాజగృహం..**

**సహపంక్తి భోజనం.. పుట్టింటి చీర సారెలతో సత్కారం**



మంథని, జూన్ 19:(వుదయం ప్రతినిధి )

పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నివాసం ‘రాజగృహం’ ఆడబిడ్డలకు తల్లిగారి ఇంటిలా మారింది.

మహాముత్తారం మండలం మీనాజిపేట గ్రామానికి చెందిన పలువురు మహిళలు శుక్రవారం రాజగృహానికి రాగా, వారికి పుట్ట మధూకర్, పుట్ట శైలజ దంపతులు ఆత్మీయ స్వాగతం పలికారు.

వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న అనంతరం మహిళలతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ స్వయంగా వడ్డించి ఆతిథ్యం అందించారు. అనంతరం మహిళలకు పుట్టింటి చీర సారెలను బహూకరించారు.

మంథనికి వచ్చిన తమకు ఇంతటి ఆప్యాయత, ఆత్మీయతను పంచిన పుట్ట దంపతులను ఎప్పటికీ మరువలేమని, తమ పుట్టింటికి వచ్చిన అనుభూతి కలిగిందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

# ఆలయ అభివృద్ధిపై విమర్శలను ఖండిస్తున్నాం

- భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న పుట్ట మధు
- శ్రీధర్ బాబుకు వచ్చే కీర్తి ప్రతిష్టలను ఓర్వలేక ఆరోపణలు



మహాదేవపూర్ జూన్ 19(వుదయం ప్రతినిధి) ఆలయ అభివృద్ధికి పోటా 92 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పై విమర్శలు చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయటమే నని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి పేర్కొన్నారు శుక్రవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాళేశ్వరం ఆలయ అభివృద్ధి జరిగితే శ్రీధర్ బాబుకు మంచి పేరు వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినటువంటి మాస్టర్ ప్లాన్ సుందరంగా ఉందని అలాంటి కట్టడం పూర్తయితే శ్రీధర్ బాబుకు కీర్తి ప్రతిష్టలు వస్తాయని కుళ్ళు తో దేవాలయ అభివృద్ధిని అడ్డుకుంటున్న పుట్ట మధు వైఖరిని ఖండిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరి ఏదో సందర్భంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉందని తెలంగాణ ప్రజలకు తెలియాలి గతంలో ఉన్నటువంటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దివాల తీయించిందనే విషయం ప్రజలకు అర్థం కావడానికి మన పరిస్థితి ఏ విధంగా ఉందని తెలియజేయడానికి పత్రిక ముఖ్యంగా ఆయన చెప్పిన మాటలను చూపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులే లేవు కదా అభివృద్ధి ఎలా చేస్తారంటూ పుట్టమధు ప్రశ్నించడం మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్ల బడ్జెట్తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు రాష్ట్రంలోనే మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించేలా కోట్ల రూపాయల నిధులు తీసుకొస్తూ చేస్తున్న కోసిని విమర్శించడం సరికాదని అన్నారు. పవిత్రమైనటువంటి భారతదేశంలోనే గొప్ప క్షేత్రంగా విరాజిల్లుతున్న కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిని అడ్డుకునేలా ప్రవర్తించడం దారుణమని భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం హేయ మైనా చర్యగా అభి వర్ణించారు.వంద కోట్ల రూపాయలు డిపాజిట్ చేయాలని మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించే విధంగా ఉన్నది అన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు కాళేశ్వర క్షేత్రానికి 25 కోట్ల రూపాయలు ఇస్తామని చెప్పి 100 రూములు కట్టినప్పుడు గాని మీరు డబ్బులు ఏ అకౌంట్ లో డిపాజిట్ చేయించారు పుట్ట మధు చెప్పాలని ప్రశ్నించారు. మహాదేవపూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి అకౌంట్లో డబ్బులు ఎంత డిపాజిట్ చేశారు

చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా భూసేకరణ చేసి ఏజెన్సీల వద్ద ఎక్కువ డబ్బులకు భూములు తీసుకున్న చరిత్ర బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని చరిత్రను మరిచిపోయి తప్పుడు ఆరోపణలు చేస్తూ దేవాలయ అభివృద్ధిని అడ్డుకోవడం తగదని దేవాలయ అభివృద్ధికి స్వాగతించాలి కానీ పేరు కోసం తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రాజెక్టులో భాగంగా సేకరించిన ఈ ప్రాంతంలోని భూములకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని అన్నారు. 25 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా చేసిన పనులకు ఇప్పటివరకు కాంట్రాక్టర్కు డబ్బులు అందలేదని దానికి మా ప్రభుత్వం బిల్లులు చెల్లించిందని అన్నారు. ప్రభుత్వ విధానాలను దెబ్బతీసే విధంగా హిస్టారీతిగా



మాట్లాడడం సరికాదని కాళేశ్వరం క్షేత్ర అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని సరస్వతి అంత్యపుష్కరాలకు 90 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా కాశీ నుండి పండితులని తీసుకొచ్చి హారతి కార్యక్రమాన్ని చేసి అద్వితీయమైన ఘట్టాన్ని ఆవిష్కరించిన వ్యక్తి శ్రీధర్ బాబు అని భక్తుల మహానుభావులను గుర్తించి కాళేశ్వరం

ముక్తేశ్వర స్వామి వద్ద భక్తులు తన్మయం పొందే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేసి పుష్కరాలను బ్రహ్మండంగానికి వహించిన వ్యక్తిగా శ్రీధర్ బాబు కొనియాడ పడుతున్నారని పనులు మొదలు కాకముందే 100 కోట్ల అవినీతి జరుగుతుందని అనడం పై తనకున్న జ్ఞానం ఎలాంటిదో ఈ ప్రాంత ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు మహిమాన్వితుడైన కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఒకే పానపట్టంపై రెండు లింగాలు ఉన్నటువంటి దేవాలయం కాళేశ్వరం మాత్రమేనని అన్నారు. దేవాలయ అభివృద్ధితో ఈ ప్రాంతం అనేక విధాలుగా అభివృద్ధి చెంది ప్రజల అభివృద్ధికి తోడ్పడుతుందని ఇప్పటికైనా సద్బుద్ధితో మాట్లాడాలని తప్పుడు ఆరోపణలు చేయడం దేవుని శిక్షకు గురి కావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్, సర్పంచ్ హసీనాబాను, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వామన్ రావు, కటకం అశోక్, కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోత రామకృష్ణ నాయకులు తుంగల సంతోష్, ముజాహిద్ ఖాన్, నయుముద్దీన్, అయితే తిరుపతి రెడ్డి, బుర్రి శివ, పదాల రాజమౌళి, గద్దం స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..

పెద్దపల్లి జూన్ 19 (వుదయం ప్రతినిధి)
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రియతమ నేత, భావి భారత ప్రధాని లోక్ సభ ప్రతిపక్ష నాయకులు గౌరవ. శ్రీ. రాహుల్ గాంధీ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేసి రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గౌరవ తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మరియు కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచ్ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కరీంనగర్ జూన్ 19 (వుదయం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం మాట్లాడుతూ, గాంధీ కుటుంబం త్యాగాలకు మారుపేరని అన్నారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చేసిన త్యాగాలను స్మరించుకు న్నారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ భారత రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్తున్న యువ నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. యువత, రైతులు, మహిళలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ఐక్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ సేవలందించడం ఖాయమని అర్ష మల్లేశం విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాశెట్టి శ్రీనివాస్, మీసాల శంకర్, మూల కృష్ణారెడ్డి, అనంతుల రమేశ్, దుగ్గు మహేందర్, అహ్మద్ హుస్సేన్, గంది గణేష్, వజీర్ ఫారుఖ్, మహమ్మద్ సమీ, అహ్మద్, మీసాల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్,డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన: జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



పెద్దపల్లి, జూన్ - 19 (వుదయం ప్రతినిధి) ?జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ, ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతో పాటు, ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, 10వ తరగతి, ఇంటర్మీడియట్ , డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చుని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలని, ?ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 22, ఉదయం 10:00 గంటలకు టాస్క్ ప్రాంతీయ కేంద్రం, పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ బస్ డిపో ప్రాంగణం పక్కన హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9154909057, 9959892960 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మందు బాబులకు లోక్ అదాలత్ షాక్..!

– డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 143 మందికి జరిమానాలు.
–మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష, భారీ ఫైన్.



వేములవాడ, జూన్ 19 ( వుదయం ప్రతినిధి): మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన 143 మందిని శుక్రవారం లోక్ అదాలత్‌లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరిచారు. కేసులను విచారించిన మేజిస్ట్రేట్ మేఘన నిందితులకు జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

జరిమానాల వివరాలు
22 మందికి ఒక్కొక్కరికి రూ. 4,000 చొప్పున
ఒకరికి రూ. 5,000 జరిమానా
53 మందికి ఒక్కొక్కరికి రూ. 3,000 చొప్పున
59 మందికి ఒక్కొక్కరికి రూ. 2,000 చొప్పున
5 మందికి ఒక్కొక్కరికిూ. 2,500 చొప్పున
3 మందికి ఒక్కొక్కరికి రూ. 3,500 చొప్పున జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను కష్టాల్లోకి నెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు వాహన తనిఖీలు నిరంతరం నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

## డిసిహెచ్ఎస్ కార్యాలయము, పెద్దపల్లి



పెద్దపల్లి జూన్ 19 (వుదయం ప్రతినిధి)
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలానికి చెందిన 30 సంవత్సరాల మహిళ గత ఐదు నెలలుగా తీవ్రమైన రక్తస్రావం మరియు కడుపునొప్పితో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో గర్భాశయం లోపలి భాగంలో గడ్డ (ఒూశీశ్రీఎజూ) ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఈరోజు వైద్యుల బృందం ఎండోస్కోపిక్ విధానంలో పాలిపెక్టమీ (ఒూశీశ్రీఎజూవష్శీఎఎ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పాలిప్‌ను తొలగించారు. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన 45 సంవత్సరాల ఒక వ్యక్తి తీవ్రమైన కడుపునొప్పితో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో పిత్తాశయంలో రాళ్లు (+ఘశ్రీశ్రీఎశ్రీఖఎంవతీ సశీఅవం) ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఈరోజు శస్త్రచికిత్స నిపుణుల బృందం లాపరోస్కోపిక్ కోలెసిస్టెక్టమీ (ఋజూఖతీశంఎశీజూఅఎ జష్ట్రశీశ్రీవఎఎర్వష్శీఎఎ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పిత్తాశయాన్ని తొలగించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన 23 సంవత్సరాల మహిళ మొదటి కాన్పు సమయంలో తీవ్రమైన గుండె సంబంధిత సమస్య (గుండె కొట్టుకునే సామర్థ్యం తక్కువ కలదు)తో ప్రాణాపాయ స్థితిలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి వచ్చారు. అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్ గారి సూచనల మేరకు డాక్టర్ శ్రీధర్ గారు స్వయంగా సుమారు 15 రోజుల పాటు కష్టపడి ప్రత్యేక చికిత్స అందించి ఆమె ను కాపాడారు. అనంతరం సదరు మహిళ రెండవ గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇక్కడి వైద్యుల సూచనల మేరకు ముందు నుంచే గుండెకు సంబంధించిన ప్రత్యేక పరీక్షలు చేసుకోవడం జరిగినది.

ఈ క్రమంలో ఈరోజు వైద్య బృందం అత్యంత అప్రమత్తతతో శస్త్రచికిత్స నిర్వహించి రెండవ కాన్పును విజయవంతంగా చేయడం జరిగినది. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.అదేవిధంగా, పెద్దపల్లి జిల్లాకు చెందిన 45 సంవత్సరాల మహిళ తీవ్ర ఊబకాయం (సుమారు 95 కిలోల బరువు) మరియు తీవ్రమైన కడుపునొప్పితో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యుల పరీక్షల్లో గర్భాశయానికి సంబంధించిన సమస్య ఉన్నట్లు గుర్తించి, ఈరోజు వైద్య బృందం హిస్టరెక్టమీ (ఎర్వతీవష్శీఎఎ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. మరోవైపు, ధర్మారం మండలానికి చెందిన 85 సంవత్సరాల వృద్ధ మహిళ పడిపోవడంతో ఎడమ తుంటి ఎముక భాగంలో ఫ్రాక్చర్ నెక్ ఆఫ్ ఫీమర్ (ఖీతీఋష్బతీవ చీవషఎ శీట ఖీవఎబతీ) సమస్యతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆర్థోపెడిక్ వైద్యుల బృందం ఆమెకు బైపోలార్ హెమి ఆర్థ్రోప్లాస్టీ (దీఅజూశీశ్రీఋతీ ఎవఎఋతీష్ట్రతీశీజూశ్రీఋర్ఎ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. వృద్ధాప్యంలోనూ క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఆమె తిరిగి నడిచే అవకాశం కల్పించామని వైద్యులు తెలిపారు.ఇట్టి సర్జరీ లలో పాల్గొన్న వైద్యుల బృందం డాక్టర్ అమర సింహా రెడ్డి, లాప్రోస్కోప్ సర్జన్; డాక్టర్ రాము జనరల్ సర్జన్; డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్ ఆర్థోపెడిక్ సర్జన్స్; డాక్టర్ అనసూయ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రవళిక, గైనకాలజిస్ట్ వైద్యులు; డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కృష్ణవేణి మరియు డాక్టర్ భవాని అనేస్తేషియా వైద్యులు. ఈ ఐదు సర్జరీలు చేసిన వైద్య బృందాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ గారు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

## విద్యా ప్రమాణాల పెంపులో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిన పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు విశిష్ట సన్మానం



పెద్దపల్లి, జూన్ – 19 (వుదయం ప్రతినిధి) విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాశాఖ అధికారులకు విశిష్ట గౌరవం లభించింది.ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్ గారు, గౌరవ ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు ఈ గుర్తింపు లభించింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది.జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా రంగ భాగస్వాములు మరియు సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలియజేసింది.జిల్లా విద్యా రంగ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్యా విధానంలో పెను మార్పులు

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**ఐఐటీ బాసరకు దమ్మన్నపేట గ్రామానికి చెందిన విద్యార్థులను సన్మానించిన విప్**
**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన విప్**
**దమ్మన్నపేటలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్.**





నిజామాబాద్, వుదయం, జూన్ 19:ప్రజా ప్రభుత్వంలో విద్యా విధానంలో పెను మార్పులు తీసుకు వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. శుక్రవారం మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు.. ఈ సందర్భంగా ఇటీవల బాసర ఐఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానించారు.. దమ్మన్నపేట గ్రామస్తులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తీర్మానం చేయడం పట్ల వారిని అభినందించారు.. అనంతరం గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు..వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతున్నామని తెలిపారు..విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పేది శ్రద్ధగా విని వాటిని పాటించాలని తెలిపారు.. బాల్యం అమూల్యమైనదని తిరిగి మళ్ళీ రాదన్నారు.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు..

దమ్మన్నపేట గ్రామస్తులు అందరూ ఏకతటి పైకి వచ్చి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తీర్మానం చేయడం పట్ల వారిని అభినందించారు..ఎన్నో ఏళ్లుగా మేడిపల్లి ప్రజలు ఎదురు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసి తరగతులు ప్రారంభం చేశామన్నారు.. మేడిపల్లి మండల అబివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు..

# వైభవంగా ఇందిరమ్మ గృహప్రవేశం

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాసారపు బాలగౌడ్**



ధర్మపురి,జూన్18 (వుదయం ప్రతినిధి):మండలంలోని నేరెళ్ల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ గృహప్రవేశ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన దావనపెల్లి రాధా మల్లేశం దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ధర్మపురి మండల సర్పం చుల ఫోరం అధ్యక్షుడు కాసారపు బాలగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై,రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా బాలగౌడ్ మాట్లాడుతూ నిరుపే దల సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. లబ్ధి దారులు నూతన గృహంలో సం తోషంగా ఉండాలని ఆకాంక్షించా రు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ శేర్ల రాజేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మెరుగు పరశురాం,తోట్ల రాజన్న,వార్డు సభ్యులు పాదం శంకర్,మామి డిపెల్లి లక్ష్మి–రాజన్న, బొంకంటి రాకేష్, కోదురుపాక మల్లేష్,గోవిం దపల్లె కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురాంశెట్టి మల్లేశం,నాయకులు చక్రాల శ్రీనివాస్, మడిశెట్టి లక్ష్మణ్, మహిళా నాయకురాళ్లు చక్రాల రజిత,బొంతలా ప్రసన్న,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దావనపెల్లి మధుకర్, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**పెండింగ్ అంశాల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**

**భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై కమిషనర్ కె. శివకుమార్ నాయుడు సమీక్ష**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 19 (వుదయం ప్రతినిధి) జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆర్ అండ్ ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండల పరిధిలోని సీతమ్మసాగర్ బహుళార్ధక ప్రాజెక్టు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తొలి పంప్ హౌస్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం, బీజీ కొత్తూరులోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తొలి పంప్ హౌస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి భూసేకరణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ బహుళార్ధక ప్రాజెక్టు, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులతో పాటు ఇతర సాగునీటి పథకాల భూసేకరణ, భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు, భూసర్వే పనులు, కోర్టు కేసుల పురోగతిని ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. అమలులో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, నిర్ణీత గడువులోగా భూసేకరణ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూనిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా చూడాలని కమిషనర్ స్పష్టం చేశారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫేజ్-1 కింద 1,522 ఎకరాల భూసేకరణకు సంబంధించి మొత్తం అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఫేజ్-2లో 2,365 ఎకరాలకు అవార్డులు జారీ చేసి భూనిర్వాసితులకు పరిహారం చెల్లించినట్లు వెల్లడించారు. ఫేజ్-3లో 1,621 ఎకరాలకు గాను 1,350 ఎకరాలకు అవార్డులు జారీ చేయగా, 903 ఎకరాలకు పరిహారం చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మిగిలిన భూములకు సంబంధించి ప్రభుత్వ నిధులు అందిన వెంటనే పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీలు-1, 2, 6లకు సంబంధించిన భూసేకరణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. సీతమ్మసాగర్ బహుళార్ధక ప్రాజెక్టు, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కూడా కమిషనర్‌కు వివరించిన కలెక్టర్, భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌డీఎల్‌సీలు రవీంద్రనాథ్, వెంకట్రావు, మండల తహసీల్దార్లు, భూసేకరణ విభాగ అధికారులు రమేష్, యాసీన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# భూధార్, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

**సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలు గడువులోగా పూర్తి చేయాలి : రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 19 (వుదయం ప్రతినిధి)రాష్ట్రంలో భూ సంబంధిత సేవలను ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంతో పాటు నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమాల పురోగతిపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

భూ సేవల అందుబాటును మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు పారదర్శక సేవలు అందించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఐడీఓసీ కాలనీలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. జిల్లాలో భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, రీ-సర్వే, నక్షా కార్యక్రమాల పురోగతిని రాష్ట్ర అధికారులకు వివరించారు. సమావేశంలో ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసరావు, మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతు భరోసా వెంటనే అందరికి ఇవ్వాలి

**: లింగాల కమల్ రాజ్.భిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గం ఇంచార్జ్.**




మధిర, జూన్ 19, వుదయం ప్రతినిధి: బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మధిర నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.మధిర పట్టణంలో పాలన పడక వేసింది దళారుల రాజ్యంగా మారిందన్నారు.రైతుబంధు రాక రైతులు గోస పడుతున్నారని గతంలో కేసీఆర్ పాలనలో రైతులకు టంచన్ గా రైతు బందు వారి ఖాతాల్లో టింగ్ టింగ్ అంటూ సమయానికి వచ్చాయి అని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వటం చేతకావడం లేదని, డిప్యూటీ సీఎం బట్టికి ప్రజా సమస్యల కంటే కమిషన్ల మీద శ్రద్ధ ఎక్కువైందని రైతులపై పట్టింపు లేదని విమర్శించారు. ఈనెల 22వ తారీఖున దెందుకూరు గ్రామంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో మధిర నియోజకవర్గం స్థాయిలో పార్టీ నియమించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కొరకు నియమించిన బిఎల్ఎ బూత్ లెవెల్ ఏజెంటు మరియు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కొరకు పార్టీ నియమించిన సమన్వయకర్తలకు శిక్షణ సమావేశం ఏర్పాటు చేశామని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ తక్కెళ్ళపల్లి రవీందర్రావు,సభ్యత్వ మధిర నియోజకవర్గం ఇంచార్జ్ నామ నాగేశ్వరరావు,ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు తాత మధు మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ తదితరులు పాల్గొంటారని ఈ సమావేశాన్ని కార్యకర్తలు నాయకులు అభిమానులు నియమించబడిన బిఎల్ఏ, సభ్యత్వ నమోదు సమన్వయకర్తలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిక్కి కృష్ణ ప్రసాద్, పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు,చిత్తారు నాగేశ్వరరావు వంకాయలపాటి నాగేశ్వరరావు,రంగిశెట్టి కోటేశ్వరరావు,బొగ్గుల భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ వైవి అప్పారావు మాజీ కౌన్సిలర్ దీరావత్ మాధవి, రాఘవరావు,కటికల సత్యనారాయణ రెడ్డి బొగ్గుల వీరారెడ్డి,బుర్రి బాబురావు ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి ఆళ్ల నాగబాబు,పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు వేల్పుల శివ, కుర్ర రంజిత్ అబ్బూరి రామన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# స్నేహ హస్తం.. రూ.21 వేల ఆర్థిక సాయం!

**అనారోగ్యంతో మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి అండ**

**ఆదర్శంగా నిలిచిన 2012-13 ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు**

చండూరు - గట్టుప్పల్, జూన్ 19 (వుదయం):కష్టం వస్తే కాపాడేవాడే నిజమైన స్నేహితుడని నిరూపించారు వారి తోటి మిత్రులు. అనారోగ్యంతో అకాల మరణం చెందిన ఓ మిత్రుడి కుటుంబాన్ని ఆదుకుని తామున్నామంటూ భరోసా ఇచ్చారు. గట్టుప్పల్ మండల పరిధిలోని ధర్మాతండాకు చెందిన కరంటోత్ లింగనాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి మరణంతో ఆ నిరుపేద కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న లింగనాయక్ చిన్ననాటి మిత్రులు (2012-13 ఎస్ఎస్‌సీ బ్యాచ్) శుక్రవారం ధర్మాతండాలోని అతడి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి దయనీయ స్థితిని చూసి చలించిన మిత్రులంతా కలిసి తక్షణ సాయంగా రూ. 21,000 నగదును సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని కొండంత భరోసా ఇచ్చారు. నిస్వార్థమైన స్నేహంతో, సేవాభావంతో స్పందించిన మిత్రుల చొరవను తండా వాసులతో పాటు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# చర్ల మండలంలో కాంగ్రెస్ లో భారీ చేరికలు




చర్ల, జూన్ 19(వుదయం ప్రతినిధి):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదినోత్సవం సందర్భంగా చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. మండలంలోని మారుమూల గ్రామాలైన కుర్నపల్లి, ఎర్రబోరు, రామచంద్రపురం గ్రామాలకు చెందిన సుమారు 300 మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, యువకులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరి తమ మద్దతు ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పోలిన లంక రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన చేరికల కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నూతనంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ విధానాలు, సామాజిక న్యాయం కోసం చేస్తున్న పోరాటం, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకత్వం చూపుతున్న చిత్తశుద్ధి పట్ల విశ్వాసంతోనే ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ఆదరణ రోజురోజుకు పెరుగుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ భారీ చేరికలు చర్ల మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఒకే వేదికపై వందలాది మంది కాంగ్రెస్ కండువాలు కప్పుకోవడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: డీఈ ప్రభాకర్**




సూర్యాపేట జూన్ :19 వుదయం ప్రతినిధియోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నల్గొండ ఎలక్ట్రిసిటీ డీఈ డి. ప్రభాకర్ తెలిపారు. ఈనెల 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈ ప్రభాకర్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరి నిజజీవితంలో యోగా ఎంతో అవసరం అని, మనిషి ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్, వాణిజ్య భవన్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, ఈద్గా రోడ్డు మీదుగా కొనసాగింది. యోగా శిక్షకులు చాడ పాపిరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది యోగా సాధకులు ర్యాలీలో పాల్గొన్నారు. యోగా గురువు చాడ పాపిరెడ్డి మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం భారతదేశంలో ఉద్భవించిన యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధనల కలయిక అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 2014 సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించగా 175 దేశాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. 2015 జూన్ 21 నుండి ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21 ఆదివారం ఉదయం 6 గంటలకు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత్ నిరంకార సంస్థ జిల్లా అధ్యక్షురాలు కడారి సరళ, యోగా సాధకులు వీ. లింగయ్య, మల్లారెడ్డి, గోరెంట్ల శ్రీనివాస్, సుధాకర్, మురళీకృష్ణ, పద్మ, కళ్యాణి, రజిత, ఉమ, సుజాత, శ్రీదేవి, జాల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల



చర్ల, జూన్ 19,(వుదయం ప్రతినిధి) చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత సాధికారత దేశాభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడుతూ, ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలిన లంక రాజు ,ఆవుల పుల్లారావు ,కాపుల నాగరాజు ,మేడబత్తిన మనోహర్ , కుంజా చంటి,మేడబత్తిన వాసు ,బ్రహ్మానంద రెడ్డి , పొగాకు సత్తిబాబు , వర్స సూరిబాబు, చినిగిరి సుధాకర్, కర్రి సంతోష్ రావు, కాయం శ్రీనివాస్ రావు, గొంది లీల ప్రసాద్, హర్షిక వీరభద్రం,రవికుమార్ సర్పంచులు , మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'దివ్య' పురస్కారం!

**పదో తరగతిలో సత్తా చాటిన చండూరు విద్యార్థిని**

**కందుల దివ్యకు ప్రశంసాపత్రం అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**గాంధీజీ విద్యాసంస్థల ప్రతిభపై సర్వత్రా హర్షం**



చండూరు, జూన్ 19 (వుదయం):పట్టుదలతో చదివితే ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది ఆ విద్యార్థిని. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో టాప్‌గా నిలిచి.. ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకునే స్థాయికి ఎదిగింది. చండూరులోని ప్రముఖ గాంధీజీ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని కందుల దివ్య (తండ్రి కృష్ణయ్య) ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఇటీవల మార్చి 2026లో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో దివ్య అసాధారణ ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజధాని హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని, పురస్కారాన్ని అందుకుంది. కనగల్ మండల పరిధిలోని జి. యడవెల్లి గ్రామానికి చెందిన ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన దివ్య, ఇంతటి ఉన్నతమైన పురస్కారాన్ని అందుకోవడం పట్ల ఆమె సొంత ఊరిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మెరిసి సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పై గాంధీజీ విద్యాసంస్థల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా. కోడి శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందంతో పాటు తల్లిదండ్రులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. దివ్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# రైతులకు సకాలంలో యూరియా సరఫరా

**జిల్లాలో 72.66 శాతం పంపిణీ పూర్తి**

**రైతులు అవసరమైన మేరకే యూరియా బుక్ చేసుకోవాలి : జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 19 (వుదయం ప్రతినిధి) రైతులకు ఎరువులు కొరత లేకుండా సకాలంలో అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో యూరియా బుకింగ్ విధానం విజయవంతంగా అమలవుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలిపారు. రైతుల అవసరాలకు తగిన విధంగా యూరియా నిల్వలను సమకూర్చి, బుకింగ్ చేసిన వారికి వేగవంతంగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. జూన్ 19, 2026 నాటికి జిల్లాలో మొత్తం 10,014 మంది రైతులు యూరియా బుకింగ్ చేసుకోగా, 39,944 బస్తాల యూరియా బుక్ చేయబడింది. వీటిలో 28,980 బస్తాలను రైతులకు పంపిణీ చేయడం ద్వారా 72.66 శాతం సరఫరా పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 1,304.10 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.




జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), రైతు వేదికలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), వ్యవసాయ అధికారులు (ఏఓలు), మండల వ్యవసాయ అధికారులు (ఎంఏఓలు) సమన్వయంతో పనిచేస్తూ యూరియా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియాను బుక్ చేసుకోవాలని, అనవసరంగా అధిక పరిమాణంలో కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని సూచించారు. యూరియా బుకింగ్, సరఫరా లేదా ఇతర వ్యవసాయ సేవలకు సంబంధించిన వివరాల కోసం రైతులు తమ సమీపంలోని ఏఈఓ, ఏఓ లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

**మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు: సూర్యాపేట ఎస్ హెచ్ ఓ వెంకటయ్య**




సూర్యాపేట, జూన్ :19వుదయం ప్రతినిధిరోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఎస్‌హెచ్‌ఓ వెంకటయ్య సూచించారు. సాంకేతికత విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన హెచ్చరించారు.

మొబైల్ ఫోన్లకు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని ఎస్‌హెచ్‌ఓ స్పష్టం చేశారు. బహుమతులు గెలుచుకున్నారంటూ వచ్చే ప్రకటనలు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగే కాల్స్ పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇలాంటి లింకులు క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందని తెలిపారు.

యువత ఈజీ మనీ కోసం ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారని, రుణాలు తీసుకున్న చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని వెంకటయ్య పేర్కొన్నారు. వ్యక్తిగత ఫోటోలు, ఫోన్ కాంటాక్టులను దుర్వినియోగం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. రహదారి భద్రత విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు. సూర్యాపేట పట్టణ పరిధిలో మైనర్లకు ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మోటారు వాహనాలు నడపడానికి ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌ఓ వెంకటయ్య విజ్ఞప్తి చేశారు.